

లీజుకు ఆర్‌టిసి స్థలాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజమహేంద్రవరం డిపో పరిధిలోని రంగంపేట, అనపర్తిలోని ఖాళీ స్థలాలను లీజు ప్రాతి పదికన ఇవ్వనట్లు ఆర్‌టిసి రాజమండ్రి డిపో మేనేజర్ షేక్‌షబ్నం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనను విడదుల చేశారు. రంగంపేట బస్ స్టేషన్ వెనుక ఉన్న 900 గజాల స్థలం, అనపర్తి బస్ స్టేషన్‌లోని 1,111 గజాల ఖాళీ స్థలాన్ని లీజుకు ఇస్తామన్నారు. లీజు కాలం 15 సంవత్సరాలుగా నిర్ణయించామని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు టెండర్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. సెప్టెంబర్ 9 వరకూ టెండర్‌కు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

అధ్యాపకులతో ఆటలు

- మే నెల వేతనాలు ఎగనామం
- వేతనాల కోసం ఎదురుచూపులు
- 3 నెలలుగా రెన్యువల్ పెండింగ్
- ఆందోళనలో కాంట్రాక్టు లెక్చరర్లు



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కాంట్రాక్టు అధ్యాపకులతో రాష్ట్ర ప్రభుత్వం దోబూచులాడుతోంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ ఒక అడుగు ముందుకు... రెండు అడుగులు వెనక్కు అన్నట్లుగా మారింది. ఏప్రిల్ 30తో వారి కాంట్రాక్టు ముగిసినా నేటికీ రెన్యువల్‌పై స్పష్టత లేకపోవటం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రతి ఏటా కళాశాలలు ప్రారంభించే నాటికి కాంట్రాక్టు లెక్చరర్లను రెన్యువల్ చేస్తూ ఉత్తర్వులు వచ్చేవి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఉత్తర్వులు జారీ కాకపోవడంతో లెక్చరర్లలో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో మూడు నెలలుగా వేతనాలు కూడా లేకపోవటంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా 15 ప్రభుత్వ జూనియర్‌కాలేజీలలో సుమారు 100 మంది కాంట్రాక్టు లెక్చవర్లు పని చేస్తున్నారు. ఏప్రిల్ 30వ తేదీతో కాంట్రాక్టు ముగిసినా వారిసేవలు మాత్రం వేసవిలో సైతం నిరంతరాయంగా కొనసాగించారు. గత ప్రభుత్వం 12 నెలలకు జీతాలు ఇచ్చారు. మే, జూన్, జులైలకు సంబంధించి వేతనాలు విడుదల కావాల్సి ఉంది. నాలుగో నెల గడుస్తున్నా ఇప్పటి వరకూ రెన్యువల్ ఉత్తర్వులు విడుదల కాకపోవటంతో అధ్యాపకుల కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2000 సంవత్సరంలో మొదలు పెట్టిన వ్యవస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల అవస్తలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ వ్యవస్థ నియామకాల ప్రక్రియ 2012తో ముగిసింది.

అందని ద్రాక్షలా రెగ్యులరైజేషన్

గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్దీకరణ పేరు చెప్పి కాలయాపన చేసింది.2014 జూన్ కి అయిదేళ సర్వీస్ పూర్తి చేసిన వారిని క్రమబద్ధీకరించాలని తొలుత నిర్ణయం తీసుకున్నారు. మళ్లీ కాంట్రాక్టు ఉద్యోగుల నుంచి వచ్చిన విన్నపాల మేరకు 2014 జూన్ 2 నాటికి సర్వీసులో ఉన్న వారందరినీ రెగ్యులర్ చేయనున్నట్లు ప్రకటించారు.ఏపీ చట్ట సభలో నూతనంగా 30 యాక్టు రూపొందించి ఆమోదించి దానికి అనుగుణంగా జిఒ 114ను జారీ చేశారు. అయితే వివిధ కారణాలతో జాప్యం జరిగింది. ఎన్నికల కోడ్ ముంగిట రెగ్యులరైజేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. గత ప్రభుత్వం ప్రకటించిన పోస్టులలో పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని కాంట్రాక్టుఅధ్యాపకులు కోరుతున్నారు.

మే నెల వేతనాలకు ఎగనామం

మే నెలలో రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కాలేజీల్లో సీనియర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు అడ్మిషన్ క్యాంపెయిన్ విధులు,ఎన్నికల డ్యూటీలు, పరీక్షల విధులు, మూల్యాంకనం విధులలో అధికారులు కాంట్రాక్టు లెక్చరర్ల సర్వీసులను ఉపయోగించుకున్నారు. 2019 ఎన్నికల ముందు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 10 రోజుల బ్రేక్‌తో 12 నెలల కాలానికి కాంట్రాక్టు లెక్చరర్ల సేవలు ఉంచాలని నవంబరు 2018లో నిర్ణయించింది. అయితే తక్షణం అమలు చేయకుండా 2019 ఏప్రిల్ నుంచి అమలు చేస్తామని ప్రకటించింది. గత ప్రభుత్వం 12 నెలల కాలానికి వేతనాలు చెల్లించింది. తాజాగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం మే నెల వేతనాలకు ఎసగు పెట్టింది. విద్యా సంవత్సరం ప్రారంభం పేరుతో జూన్ నుంచి గణన ప్రారంభించినట్లు తెలుస్తోంది.

జూన్ నెల నుంచి వేతనాలు వచ్చే అవకాశం

కాంట్రాక్టు లెక్చరర్ల రెన్యువల్ ప్రక్రియ ప్రారంభమైంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో రెన్యువల్స్ చేపడుతున్నాం. జూన్ నెల నుంచి వేతనాలు జమ చేసే అవకాశం ఉంది. విద్యా సంవత్సరం జూన్ నుంచే ప్రారంభం కావటంతో అప్పటి నుంచే గణన ప్రారంభమవుతోంది.

- నర్సింహం, ఆర్‌ఐఒ ఇంటర్మీడియట్ విద్యా శాఖ, తూర్పుగోదావరి జిల్లా



8 నుంచి జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ

ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్, ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సెప్టెంబర్ 8నుంచి 11వ తేదీ వరకు నాలుగు రోజులపాటు రాజమహేంద్రవరంలో 78వ నేషనల్ మెగా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 ఈవెంట్ జరుగుతుందని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్‌ఎ, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీలకు జాతీయ క్రీడాకారులు 150 మంది వరకు వస్తున్నారని తెలిపారు. వీరందరికీ అన్ని రకాల సౌకర్యాలను కమిటీ ఏర్పాటు చేస్తోందని చెప్పారు. స్థానిక నారాయణపురం ఆర్‌ఎంసి ఇండోర్ షటిల్ కోర్టులో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అందరినీ ఇందులో భాగస్వామ్యం చేసి, ఎక్కడా లోటు లేకుండా చేయాలని చూస్తున్నామన్నారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్నాయుడు, మంత్రులు ఎం.రామ్‌ప్రసాద్, కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి తదితరులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రెండు దశాబ్దాల తర్వాత నిర్వహించే ఈ టోర్నమెంట్ కి పార్టీలకతీతంగా పెద్దలందరూ సహకరించాలని కోరారు. ఆర్గనైజింగ్ కమిటీని కూడా వేశామని, వారంతా బాధ్యతగా భావించి, అందరినీ కలుపుకుంటూ, టోర్నీ విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. పారదర్శకంగా జడ్జిమెంట్ ఇస్తూ, టోర్నీని విజయవంతం చేయడానికి కమిటీ కషి చేస్తుందన్నారు.

గతంలో తెలంగాణలో పుల్లెల గోపీచంద్ అకాడమీకి అప్పటి ఉమ్మడి ఎపి సీఎం చంద్రబాబు స్థలం కేటాయించి ప్రోత్సాహకాలు ఇచ్చారని గుర్తుచేశారు. 2002లో నేషనల్ టోర్నీ కూడా ఉమ్మడి ఎపిలో నిర్వహించారని తెలిపారు. 2027లో కూడా ఎపిలో నేషనల్ గేమ్స్ నిర్వహించ డానికి కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. రాజమండ్రిని కూడా స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దు తామని, ఎన్నికల్లో చెప్పినట్లు చేసి చూపిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా నూతనంగా ఏర్పాటుకాబోయే ఎపి క్రికెట్ అసోసియేషన్ కార్యవర్గం రాజమండ్రిలో ఉమెన్ క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేయడానికి సూత్రప్రా యంగా అంగీకరించిందని వాసు తెలిపారు. త్వరలోనే మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కూడా ప్రారంభం అవుతుందన్నారు. బాడ్మింటన్ అసోసి యేషన్ స్టేట్ సెక్రటరీ అంకం చౌదరి మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌కు జాతీయ స్థాయి క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. పివి.సింధు, పుల్లెల గోపిచంద్, వెంకట్ వంటి జాతీయ స్థాయి క్రీడా కారులు హాజరవుతారని పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చినవారు వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం (బాలు), మెంబర్స్ అత్తి సత్యనారాయణ, యిన్నమూరి దీపు, ఎం ఎస్ బి శంకర్, అలవల రాంబాబు, బి వెంకట్, ఎస్ పోలరాజు, డాక్టర్ సివిఎస్ రెడ్డి, కామి నాగేశ్వరరావు, యు సత్యనారాయణ, బొమ్మన రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్య పోరాటం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమస్యలపై ఐక్యంగా పోరాడుతామని విద్యుత్ ఒసి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం రాజమమేంద్రవరం సంఘం ప్రాంతీయ సమావేశం జరిగింది. విద్యుత్ సంస్థల్లో ప్రమోషన్లలో రిజర్వేషన్‌లలో బిసి, ఒసి, మైనారిటీ ఉద్యోగులకు జరగుతున్న అన్యాయముపై చర్చించారు. దీనిపై పోరాడటానికి ఒసి, బిసి ఉద్యోగులు జెఎసిని ఏర్పాటు చేశారు. మెరిట్, సినియార్టీ, క్యాచ్ అప్ రూల్‌పై ప్రమోషన్లు అమలు చేయాలని తీర్మానించారు. ఈ మేరకు కలిసి పోరాడాలని నిర్ణయించారు. విద్యుత్ ఒసి, బిసి, మైనారిటి ఉద్యోగులు సంఘీభావం తెలపాలని కోరారు. ఈ సందర్భంగా నూతన పాలక వర్గాన్ని ఎన్నుకున్నారు. కెవివి.రమణ జిల్లా అధ్యక్షునిగా, దామోదర శ్రీనివాస్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఒసి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ వర్మ, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ పండుదొర ఇపిడిసిఎల్ ప్రధాన కార్యదర్శి తురగా రామకృష్ణ, వివిధ జిల్లాల కార్యదర్శులు, బిసి అసోసియేషన్ తరపున కెవి.నరసింహారావు, రీజినల్ సెక్రటరీ కె.శివప్రసాద్, రవికుమార్, సత్తిబాబు, రాంబాబు, కోటేశ్వరరావు, ఎపి విద్యుత్, బిసి అండ్ ఒసి ఉద్యోగుల జెఎసి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు రమణ

పచ్చని చెట్లే భవితకు మెట్లు

ప్రజాశక్తి - గోపాలపురం

పచ్చని చెట్లు భవిష్యత్తుకు పునాది అని మానవత చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. మండలం 'మానవత స్వచ్ఛంద సేవా సంస్థ' నెలవారి సమీక్ష సమావేశం ఆదివారం జరిగింది. అనంతరం మానవత ఆధ్వర్యంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో "మొక్కలను నాటే కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడారు. వాతావరణం కాలుష్యం బారిన పడకుండా గాలి కలుషితం కాకుండా ఉండాలంటే విరివిగా మొక్కలు నాటాలన్నారు. ట్రెజరర్ గడ జోగేంద్ర ప్రసాద్ విద్యార్థులకు 'పర్యావరణం పరిరక్షణ'పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పప్పు సత్యకృష్ణారెడ్డి, ట్రెజరర్ గడా జోగేంద్ర ప్రసాద్, కో-చైర్మన్ నెల్లి చంద్రశేఖర్, ఈసీ మెంబర్ జుత్తిగ సూర్య చంద్రం, సభ్యులు కృపావరప్రసాద్‌రెడ్డి, సిఆర్‌సి కొయ్య నాగరాజు, ఉపాధ్యాయులు దేవి, నీలిమ, సుభాషిణి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో గేదె మృత్యువాత

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రమాదవశాత్తు తెగిపడిన విద్యుత్ వైర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై గేదె మృత్యువాత పడింది. ఈ ఘటన దొండపూడి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన రైతు రుద్రం త్రిమూర్తులుకు చెందిన చూడు గెదెపై ఉదయం 9గంటల సమయంలో విద్యుత్ వైరు తెగిపడింది. విద్యుదాఘాతానికి గురై గేదె అక్కడికక్కడే మృతి చెందిది. గేదె విలువ రూ.1లక్ష వరకూ ఉంటుందని రైతు తెలిపాడు. నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నాడు.

తెలుగు భాష, సంస్కృతిని కాపాడుకోవాలి

మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తెలుగు భాష, సంస్కృతిని కాపాడుకోవాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో థానే నగరంలోని డాక్టర్ కాశీనాథ్ ఘనేకర్ ఆడిటోరియంలో తెలుగు మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి ఉద్యోగ, వ్యాపార, పరిశ్రమల ఏర్పాటు కోసం మహారాష్ట్రకు వలస వెళ్లిన తెలుగువారు ప్రతి ఏటా ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ తరపున తెలుగు మహాసభలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా కవి, ప్రముఖ సాహిత్య వేత్త జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత మంత్రి కందుల దుర్గేష్‌కు, జొన్నవిత్తులకు మహారాష్ట్ర థానే తెలుగు అసోసియేషన్ చైర్మన్ రమణ, అధ్యక్షులు జగన్ బాబు, విద్యాసంస్థలు అధినేత జెవి.గుప్త, గురవరెడ్డి, సత్యమూర్తి తదితరులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ఈ తెలుగు సభలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అమ్మలాంటి మాతృ భాష తెలుగు భాషను కాపాడుకునేందుకు, దాని ఔనత్యాన్ని భావితరాలకు తెలియజేసేందుకు ఇక్కడ తెలుగువారంతా కలిసి ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. ఎక్కడున్నా తెలుగు భాష, సంస్కృతిని మరువరాదన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్ తెలుగు భాషాభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ తెలిపారు. తెలుగువారి కోసం ఎలాంటి సహకారం కావాల్సి వచ్చినా తమ కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎపిలో పెట్టుబడులు పెట్టే వారికి ఇతోధిక ప్రోత్సహం అందిస్తామని తెలిపారు. అసోసియేషన్ నిర్వాహకులు రమణ, గంజి జగన్‌బాబురను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పడిన తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ బ్యానర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్‌ను, జొన్నవిత్తులను ఫెడరేషన్ ఘనంగా సత్కరించింది.



మంత్రి కందుల దుర్గేష్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

చోరీల నివారణకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి - చాగల్లు

చోరీల నివారణకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ కె.నరేంద్ర కోరారు. సాధ్యమైనంత వరకూ ఇళ్లు, షాపుల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంటిని విడిచి బయట ప్రాంతాలకు వెళ్లినప్పుడు తప్పని సరికా పోలీసులకు, పక్కంటి వారికి సమాచారం ఇవ్వాలన్నారు. విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో పెట్టుకోవాలన్నారు. మహిళలు ఒంటరిగా వాకింగ్‌కు వెళ్లే సమయంలో బంగారు వస్తువులు వేసుకోకుండా ఉండటం మంచిదన్నారు. ఇద్దరు, ముగ్గురు కలిసి వాకింగ్ చేసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పరిశీలించాలని, అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.


ఎంఎల్‌ఎ సత్యానందరావుకు వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఎంఎల్‌ఎ బండారుకు నర్సరీ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి- కడియం

కడియం నర్సరీలకు అనుసంధానమైన కొత్తపేట నియోజకవర్గం పరిధిలో ఉన్నటువంటి మడికి, చిలకలపాడు, మల్లవానితోట నర్సరీ రైతుల సమస్యలపై సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో ఆదివారం ఎంఎల్ఎ బండారు సత్యానందరావు కలిసి వినతి పత్రం అందించారు. నర్సరీ రంగానికి అత్యంత కీలకమైన రోడ్ రవాణా వ్యవస్థ అని, మొక్కల వాహనాలు రవాణాకు వీలుగా నర్సరీల పరిధిలోని అన్ని రోడ్లను వెడల్పు చేయాలని, అలాగే పటిష్టమైన రోడ్లను నిర్మించాలని కోరారు. ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సానుకూలంగా స్పందించారు. త్వరలోనే నర్సరీల అభివృద్ధికి కృషి చేస్తానని, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు పోలరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పెనుమాక కొండబాబు, సెక్రటరీ గాద నాగేశ్వరరావు, డైరెక్టర్లు గట్టా కృష్ణభగవాన్, రావిపాటి రామకృష్ణ, తాడాల బాలమురళీకృష్ణ, జంగా సుబ్బారావు, గరగనాగేశ్వరరావు, అడ్డగర్ల రమేష్, గాజుల రత్తయ్య, తాడాల నాగేశ్వరరావు, పిల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బాలోత్సవం ఆధ్వర్యంలో పోటీలు

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం లోని శశి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక మీద దేవరపల్లి బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాత పోటీ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ప్రథమ బహుమతి తలారి గోపీచందన, ద్వితీయ బహుమతి పిల్లాడ రాకేష్, తృతీయ బహుమతి చిన్నం వినోద్ సాధించారు. ఇప్పటి వరకు మండలంలోని 18 హైస్కూల్స్‌కు 13 స్కూల్స్‌లో పోటీ పరీక్షలు నిర్వహించగా 830 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీ పరీక్షల్లో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందించామన్నారు. ప్రతి స్కూల్‌కి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించామని బాలోత్సవ కమిటీ సభ్యులు ఉండవల్లి కృష్ణారావు, ఆచంట సుభాషచంద్రబోస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉప్పల మహేశ్వరరావు, ఇతర టీచర్లు పాల్గొన్నారు.


విజేతలతో బాలోత్సవం నిర్వాహకులు

కార్టూన్ 'నిజం'



విజయానికి కృషి చేసిన వారికి ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, పెరవలి

టిడిపి యాప్ ద్వారా 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో పార్టీకి సంబందించిన సమాచారాన్ని ప్రజలకు షేర్ చేసి, తద్వారా కూటమి విజయానికి విశేషంగా కృషి చేసిన పలువురికి నిడదవోలు మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు ఆదివారం ప్రశంసా పత్రాలు అందజేశారు. మండ లంలోని వేలివెన్ను, శేషారావు స్వగహంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్ర మంలో నియోజకవర్గంలో ఎక్కువ పాయింట్స్ సాధించిన అబ్బిశెట్టి సత్తిరాజు, నల్లాకుల వెంకట శ్రీనివాస్‌అబ్బిశెట్టి సతీష్ శిరిగిన బాబీ రమేష్, కొప్పుల నాగ శ్రీనివాస్, గద్దె హనుమాన్ చౌదరి, నేదునూరి గీతా లక్ష్మి, పాలా వెంకన్న, నల్లాకుల గణపతి, కాకర్ల వెంకట రామకష్ణ, మంగం రామారావులకు వీటిని అందించారు.

పెరవలి మండలం నిడదవోలు నియోజకవర్గంలో ఎక్కువ పాయింట్స్ సాధించిన నాయకులు పది మందిలో ఆరుగురు పెరవలి మండలానికి చెందిన వారు ఉన్నారు. వీరిలో మొదటి స్థానం నియోజవర్గ ఐటిడిపి అధ్యక్షుడు అబిశెట్టి సత్తిరాజు, రెండో స్థానం మంగం రామారావు నిలిచారు . ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నారా లోకేష్ పంపించిన ప్రశంసా పత్రాలను మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు చేతుల మీదగా వారు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. అలాగే అబ్బిశెట్టి సత్తిరాజు, నల్లాకుల వెంకట శ్రీనివాస్, అబ్బిశెట్టి సతీష్, శిరిగిన బాబీ రమేష్, కొప్పుల నాగ శ్రీనివాస్ గద్దె హనుమాన్ చౌదరి, నేదునూరి గీతాలక్ష్మి, పాలా వెంకన్న, నల్లాకుల గణపతి, కాకర్ల వెంకట రామకృష్ణ, ఎం.రామారావు పాల్గొన్నారు


ప్రశంసా పత్రాలు పొందిన వారితో మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు

హీరో రవితేజ కోసం అభిమానుల పూజలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

షూటింగ్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడిన హీరో రవితేజ త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తూ రాజమండ్రి సిటీ రవితేజ ఫాన్స్ అధ్యక్షులు డాన్ శీను ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్ కాలేజీ ఎదురుగా ఉన్న ఆంజనేయ స్వామి గుడిలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాన్ శీను మాట్లాడుతూ మాఅభిమాన హీరో రవితేజకి జరిగిన చిన్న ప్రమాదాన్ని సోషల్ మీడియాలో అతనికి పెద్ద ప్రమాదం జరిగిందని, ఇక కోలుకోలేరు అంటూ వచ్చిన వార్తలను ఖండిస్తున్నామన్నారు. ప్రమాదం అనంతరం ఒక సాధారణ సర్జరీతో కోలుకున్నారని, ఆయన త్వరలోనే షూటింగ్‌లో పాల్గొంటారన్నారు. సోషల్ మీడియాలో వచ్చే దుష్ప్రచారం నమ్మొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సిటిఆర్‌ఐ బాసి, రాజమండ్రి ప్రభాస్ ఫ్యాన్స్ సిటీ ప్రెసిడెంట్ వై.దేవిప్రసాద్ మాట్లాడుతూ అందరి హీరోల అభిమానులని కలుపుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన డాన్ శీనుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెగా ఫ్యామిలీ అభిమాని గుణ్ణం శ్యాంసుందర్, సూపర్ స్టార్ కష్ణ, మహేష్‌బాబు సేవాసమితి అధ్యక్షులు తనూజ్, గోపీచంద్ రాజమండ్రి ప్రెసిడెంట్ శ్యామ్, రాజమండ్రి సిటీ మహేష్‌బాబు ఫ్యాన్స్ వైస్ ప్రెసిడెంట్ చందు, ఇతర హీరో అభిమానుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, పెరవలి

దేశంలోని ప్రతి మహిళ ఆర్థిక శక్తిగా ఎదగాలనేదే భారత ప్రధాని మోడీ ప్రధాన ఉద్దేశమని ఉండ్రాజవరం మండల బిజెపి అధ్యక్షులు బూరుగుపల్లి శివరామకష్ణ అన్నారు. ఆదివారం మండల సమైక్య కార్యాలయంలో నిర్వహించిన లక్ పతి దిది యోజన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఎపిఎం నాగలక్ష్మి మాట్లాడుతూ ఏడాదికి ప్రతి మహిళ చేతిలో కనీసం రూ.లక్ష నికర లాభం ఉండేలా కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. వివిధ రకాల జీవనోపాధి లు నిర్వహిస్తున్న మహిళలకు ప్రశంసా పత్రాలు, చెక్కు అందజేశారు. మండలంలోని 24 గ్రూపులకు రూ.3.10 కోట్ల చెక్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, సెక్రటరీ సుబ్బలక్ష్మి, సిసిలు కె.ఉదయ్‌కుమార్, వి.రాజాబాబు, విఒఎలు హాజరయ్యారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుండాలని ఎంపిపి కె.సీతారాం ప్రసాద్ అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న డ్వాక్రా భవనంలో లాఖ్ పత్ దిది ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో ఈ ఆర్థిక సంవత్సరం 29 మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు ద్వారా రూ.3.20 కోట్ల వ్యాపారాలు చేయడానికి రుణాలుగా అందించామని ఎపిఎం నాగరాజు తెలిపారు. డ్వాక్రా ద్వారా పొందుతున్న రుణాలతో వ్యాపారం చేసి ఆర్థికంగా ఎదగిన కొంతమంది మహిళలకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమం లో మండల సమాఖ్య అధ్యక్షులు ఎ.స్వరూపారాణి, కార్యదర్శి మంగతాయారు యానిమేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం నీలపల్లి పరిధిలో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక చేపల మార్కెట్ సమీపంలో వీరు పేకాడుతుండగా అరెస్టు చేసి, వీరి వద్ద నుంచి రూ.4500 స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించినట్టు ఆయన తెలిపారు.

మరిడమ్మ ఆలయంలో వెండి ఆభరణం చోరీ

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం స్థానిక రైల్వే స్టేషన్ రహదారిలో ఉన్న మరిడమ్మ తల్లి ఆలయంలో వెండి ఆభరణం చోరీకి గురైనట్టు అన్నవరం పోలీసులకి ఆలయ నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి శనివారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు అమ్మవారిని దర్శించుకునే వంకతో ఆలయంలో ప్రవేశించి అమ్మవారి కాలికి ఉన్న లక్ష విలువ గల వెండి పాదాన్ని అపహరించుకు పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయంలో ఉన్న సిసి కెమేరా పనిచెయ్యకపోవడం గమనార్హం.



మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లిదండ్రులు

ఆర్‌టిసి బస్సు ఢీకొని యువకుడు మరణం

ప్రజాశక్తి - తాళ్లరేవు

గాడిమొగ గ్రామానికి చెందిన మల్లాడి గంగాధర్ (26) ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తాళ్ళరేవు నుంచి యానాం వైపు బైకుపై వెళ్తున్న గంగాధర్‌ను అమలాపురం నుంచి కాకినాడ వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఎదురుగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. చేతికి అంది వచ్చిన కొడుకు అనుకోని ప్రమాదంలో అసువులు బాయడంతో అతని తండ్రి మల్లాడి రాఘవ కొడుకు మతదేహంపై పడి గుండెలవిసేలా రోదించాడు. రాఘవకు నలుగురు కుమారులు కాగా గంగాధర్ మూడో కుమారుడు. ఇటీవల తాళ్ళరేవు బైపాస్‌లో వ్యాపార దుకాణం ప్రారంభించారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని గ్రామాల పరివాహక లంక ప్రాంతాలలో ఆదివారం ఎస్సై ఎస్ శ్రీనివాస్ నాటు సారా తయారీ స్థావరాలపై తన సిబ్బందితో విస్తత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బొబ్బర్లంక గ్రామ శివారు లంకలో నాటు సారా తయారు చేయడానికి ఉంచిన180 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మహిళ అదృశ్యమైన ఘటనపై అంగర పోలీసులు కేసు నమోదు చేశారు. కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన అంసూరి సత్యవతి (66) సం?లు ఈ నెల 16 నుంచి కనిపించడం లేదంటూ ఆమె మనవడు అంసూరి శ్రీనివాస్ ఈనెల 18న అంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై 19న కేసు నమోదు చేశారు . బైయటకువెళ్లిన సత్యవతి ఇంటికి తిరిగి రాలేదంటూ శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విద్యుత్ షాక్ కు గురై ఆదివారం ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని తానేల్లంక పంచాయతీ పరిధిలోని రజక పేటకు చెందిన పల్లపు గంగరాజు(35) పెయింటింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గంగరాజు ఒక పెయింటర్ వద్ద పనిచేస్తున్నాడు. కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామంలో వినాయకుడి గుడికి రంగులు వేస్తుండగా గంగరాజుకు విద్యుత్ తీగ తగలడంతో షాక్ గురై అక్కడికక్కడే మతి చెందాడు. రంగరాజుకు భార్య లక్ష్మి, కుమారుడు వీర నాగ కార్తికేయ, కుమార్తె ధరణి మహిత ఉన్నారు. ఆ కుటుంబానికి అతడే ఆధారం. యజమాని ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామంలో అందరితో ఎంతో కలివిడిగా ఉండే రంగరాజు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని అద్దంకివారి లంకలో కోడి పందేల శిబిరంపై అంగర పోలీసులు ఆదివారం దాడి చేశారు. అంగర ఎస్ఐ అందే పరదేశి తెలిపిన వివరాల ప్రకారం అద్దంకి వారి లంక గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. పందేలు ఆడుతున్న అయిదుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రెండు పందెం కోళ్ళు , రెండు మోటార్ బైకులు, రూ.8,020 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు .

యుటిఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావుకు పరామర్శ

ప్రజాశక్తి-ఆలమూరు

మండల యుటిఎఫ్ అధ్యక్షులు అద్దరి శ్రీనివాసరావు తండ్రి అద్దరి వీర్రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శ్రీనివాస్‌ను యుటిఎఫ్ మండల శాఖ నాయకులు ఆదివారం పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల యూనియన్ నాయకులు కెవిఆర్.బాపూజీ, వైవివి.రమణ, మూర్తి, మనోజ్‌కుమార్, లోకేష్, శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవిపై అవగాహనా కార్యక్రమాలు

లెప్రసీ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ వసుంధర



ముఖాముఖి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు, మార్గదర్శకాలతో జిల్లాలో యువతలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఆగస్టు 29న నిర్వహించనున్నారు. తూర్పు గోదావరి జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు టిబి అధికారి డాక్టర్ ఎన్.వసుంధరను ప్రజాశక్తి పలుకరించగా పలు విషయాలను పంచుకున్నారు.

హెచ్‌ఐవిపై అవగాహన కల్పించేందుకే...

హెచ్ఐవి, ఎయిడ్స్ అవగాహనా కార్యాక్రమాలు చేపడుతున్నాం. హెచ్ఐవి నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండటం అవసరం. ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కళాజాతాలు, పోస్టర్ల ప్రదర్శన, ర్యాలీలు, సమావేశాలు ఇలా పలు విధాలుగా హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలను రూపొందించాం. వీటిని తుచ తప్పకుండా అమలు చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.

అవగాహనలో భాగంగానే యూత్ ఫెస్టివల్

ఆగస్ట్ 29న నిర్వహించే యూత్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా డిగ్రీ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు, ట్రాన్సజెండర్లతో ఆగస్టు 29వ తేదిన 5కె రన్ నిర్వహిస్తున్నాం. ఐదు కిలో మీటర్ల మారథాన్ కార్యక్రమాన్ని ఉదయం 6.30 లకు రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ నుంచి గోదావరి నదీ తీరాన ఉన్న ఇస్కాన్ టెంపుల్ వరకు వయా నందం గనిరాజు జంక్షన్, కంబాల చెరువు, దేవి చౌక్, గోకవరం బస్టాండ్, మున్సిపల్ పార్క్, పుష్కర ఘాట్, గోదావరి బండ్ వరకూ నిర్వహిస్తున్నాము.

విజేతలకు బహుమతులు

విజేతలకు జిల్లా కలెక్టరు చేతుల మీదుగా బహుమతులు అందిస్తాం. ప్రథమ బహుమతి రూ.5,700, ద్వితీయ రూ.4వేలు, బాలురు, బాలికలు, ట్రాన్స్ జెండర్స్ విభాగాల్లో అందిస్తాం. అదే విధంగా 8వ, 9వ మరియు 10వ తరగతి చదువుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 29వ తేది ఆగస్టు 2024న మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా లెప్రసి, ఎయిడ్స్ మరియు టీబీ శాఖాధికారి వారి కార్యాలయంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తాం. విజేతలకి ప్రథమ బహుమతిగా రూ.7 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4 వేలు అందిస్తాం. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9581531960, 9949495022 ఫోన్ నెంబర్లను సంప్రదించాలి.



అవార్డు అందుకుంటున్న యానిమేటర్ పద్మ

కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు

ప్రజాశక్తి-గండేపల్లి

విధి నిర్వహణలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎపిఎం సన్యాసిరావు అన్నారు. లఖ్-పతి దీదీ కార్యక్రమం ద్వారా సర్వే పూర్తిస్థాయిలో చేయడం వల్ల గండేపల్లి మండలానికి యానిమేటర్ వల్లూరి పద్మకి అవార్డు అందడం అభినందనంగా ఉందన్నారు, జిల్లా జాయింట్ కలెక్టర్, డ్వామా పీడీ ద్వారా ఆమె ప్రశంసా పత్రం అందుకున్నట్టు తెలిపారు. ఆమెకు ఈ అవార్డు రావడం పట్ల వెలుగు కార్యాలయం, ఎపిఎం సన్యాసిరావు, సిబ్బంది మండల నాయకులు అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ

సేవా నిరతిని చాటిన శివన్నారాయణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామీణ ప్రజలకు అందుబాటులో సేవా దక్పథంతో అన్ని హంగులతో కళ్యాణమండపం నిర్మించి శివన్నారాయణ తన సేవా నిరతిని మరొకసారి చాటుకున్నారని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో ఎఎంసి చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ నిర్మించిన కెవిఎస్ కన్వెన్షన్ కళ్యాణ మండపాన్ని మంత్రి ఆదివారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో పటవల మాజీ సర్పంచ్ కాలా సూరిబాబు, కూటమి నాయకులు బొంతు శ్రీనివాస్, దున్న మురళి, దున్న ఎల్లారావు, మేడిశెట్టి శ్రీను, సూరంపూడి శ్రీను, హరిబాబు, మట్టపర్తి శ్రీను పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీతనంగా పోలీసులు

ప్రజాశక్తి-కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి రఘువీర్ విష్ణు

పోలీసులు ప్రజలకు జవాబుదారీతనంగా పని చేయాలని, రాజకీయ ఒత్తిడిలకు భయపడకుండా పని చేయడమే పోలీస్ శాఖ పని అని కాకినాడ డిఎస్‌పి రఘువీర్ విష్ణు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను గతంలో చిత్తూరు డిఎస్‌పిగా విజయనగరం ఎసిబి డిఎస్‌పిగా పని చేసి బదిలీపై కాకినాడ వచ్చినట్టు తెలిపారు. ప్రజల శాంతి భద్రతల విషయంలో రాజీ లేని పోరాటం చేస్తానని, ఎటువంటి రాజకీయ ఒత్తిడిలకు భయపడి పని చేసే సమస్య లేదన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన నేరుగా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తమకు న్యాయం జరగలేని పక్షంలో కాకినాడ డిఎస్‌పి కార్యాలయంలో సంప్రదిస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ, రెండవ పట్టణ, ఒకటో పట్టణ సిఐలు, ఎస్ఐలు, ఎఎస్ఐలు, పోలీసు సిబ్బంది డిఎస్‌పిని మర్యాదపూర్వక కలిసారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పలువురికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

తాటిపర్తిలో ఆదివారం గుమ్మలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కొమ్మిరెడ్డి బుజ్జి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలందరికీ అన్ని రకాల వైద్య సేవలూ అందించేందుకు దాతలు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది వైద్య సేవలందించారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కళ్లజోళ్లు అవసరమైన వారిని, ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి శ్రీను, ఎగ్గాడ సత్తిబాబు, ద్వారంపూడి చెల్లారావు, కొమ్మిరెడ్డి నాగ సుబ్రహ్మణ్యం, వేపకాయల తిరుపతిరావు, గోపు చంటిబాబు, కొమ్మిరెడ్డి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు ఇస్తామని అవమానించారు

ప్రజాశక్తి-కాకినాడ

బాగా పనిచేసే వారికి ప్రోత్సహించేదిగా కేంద్రం లఖ్-పతి దీదీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కలెక్టరేట్ వద్ద కార్యక్రమానికి తమను రమ్మని అవమానించారని యానిమేటర్ల సంఘం జిల్లా ప్రెసిడెంట్ కంద భవాని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ రూరల్ మండలంలో విఒఎలు వ్యాపారవేత్తలను రమ్మని ఆఖరి వరకు ఉంచి అవార్డు ఇస్తామని చెప్పి అధికారులు తప్పుకున్నారని తెలిపారు. తమను ఎందుకు రమ్మన్నారు ఎందుకు పొమ్మన్నారని ఆమె ప్రశ్నించారు. గత సంవత్సరం మహిళా దినోత్సవం రోజున సామర్లకోటలో అవార్డులు ఇస్తామని చెప్పి ఇలాగే అవమానించారని తెలిపారు. తమకు ఘోర అవమానం జరిగిందని దీనికి బాధ్యులు ఎవరో తేల్చేవరకూ కాకినాడ రూరల్ మండల మహిళా సమాఖ్య ముందు నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు.



సమావేశానికి వెళ్లిన మండల నాయకులు

సమావేశానికి తరలిన నాయకులు

ప్రజాశక్తి -కరప

ఎస్‌సి వర్గీకణపై సుప్రీంకోర్టు తీర్పునకు నిరసనగా విజయవాడలో నిర్వహించిన సమావేశానికి పలువురు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, మాల మహానాడు నాయకులు తరలివెళ్లారు. సుప్రీంకోర్టు న్యాయవాదులు మిశ్రా, సత్య ప్రకాష్, గౌతం ఆధ్వర్యంలో జెఎసి సమావేశం నిర్వహించారని. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వర్గీకరణపై ఏ విధమైన కార్యచరణ చేయాలో జాతీయ స్థాయి నాయకులు నిర్ణయాలు తీసుకున్నట్టు సవిలే రాజేష్, మాతా అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారెళ్ల వెంకటరమణ, చిన్న వెంకటేశ్వరరావు, ఫైట్ ఫర్ రైట్ ఫోరం అధ్యక్షుడు బుల్లి రాజు, కరప గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి లోహిదాస్, వజ్రపు కామేశ్వరరావు, గుబ్బల రామకృష్ణ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ నిరసన

ప్రజాశక్తి-ఏలేశ్వర

రాష్ట్రంలో వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే విధానాన్ని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని సిపిఐ (ఎంఎల్, వినోద్ మిశ్రా) రాష్ట్ర కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో స్మార్ట్ మీటర్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిందన్నారు. అధికారంలోకి వచ్చాక కేంద్ర ఆదేశాలకు లొంగి రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, గృహ అవసరాలకు కూడా విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసేందుకు సన్నద్ధం అయిందని ఆరోపించారు. అదానీ కంపెనీకి వేల కోట్లు ముట్ట చెప్పేందుకే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రక్రియ తెరపైకి తెచ్చింది అన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పెద్ద ఎత్తున ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కందుల క్రాంతి కుమార్ మహిళా సంఘం నాయకులు గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, గూనాపు వరలక్ష్మి, చందక దేవి, లోపింటి వరలక్ష్మి, చాచేపల్లి సీత తదితరులున్నారు.

నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం

- మంజూరు కాని నిధులు
- పూర్తిచేయాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-కోటనందూరు

కోటనందూరు మండలంలో ప్రభుత్వ విద్యాలయాల అదనపు గదులు నిర్మాణ పనులు నిధులు కొరతతో నిలిచిపోయాయి. కోటనందూరు మండలంలో మండలంలో 17 గ్రామపంచాయతీలో ఏడు జిల్లా పరిషత్ హై స్కూల్ ఉన్నాయి. అల్లిపూడి, కేఈ చిన్నయపాలెం, బొద్దవరం, హై స్కూల్ అభివృద్ధి కొరకు గత ప్రభుత్వంలో నాడు- నేడు పథకం ద్వారా ప్రభుత్వ విద్యాలయాల అభివద్ధి కొరకు నిధులు కేటాయించారు. అల్లిపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో అదనపు తరగతుల అయిదు గదులు నిర్మాణానికి రూ.50.99 లక్షలు కేటాయించగా వీటిలో రూ.41.19 లక్షల ఖర్చు చేశారు. ఓపెన్ శ్లాబ్ వేసి వదిలేశారు. ప్రహరీ నిర్మాణము చేపట్టలేదు. నిధుల కొరతతో మధ్యలోనే పనులు నిలిపివేయడం జరిగింది. బొద్దవరం గ్రామం హైస్కూల్లో లో అదనపు తరగతి నాలుగు గదిలో నిర్మాణానికి తొమ్మిదవ కాన్ఫరెన్స్ నిధులు రూ.88 లక్షలు మంజూరు చేసి వీటిలో రూ.36 లక్ష లు నిధులు ఖర్చు చేసి కొంతమేర నిర్మాణ పనులు చేసి మధ్యలోనే వదిలేశారు. కెఇ.చిన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో తొమ్మిదవ కాన్ఫిడెన్స్ నిధుల ద్వారా కోటి రూపాయలు నిధులు మంజూరు చేశారు. రూ.45 లక్షల నిధులు ఖర్చు చేసి కొన్ని పనులు పూర్తి చేశారు. హైస్కూల్ ప్రహరీ కూడా అసంపూర్తిగా నిర్మించారు. నిధులు పూర్తిగా మంజూరు చేయకపోవడం వల్ల నిర్మాణ పనుల మధ్యలోనే నిలిచిపోయాయని మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఏడాది విద్యా సంవత్సరంలో స్కూళ్లు ప్రారంభించి నెలలు గడుస్తున్నాయని అన్నారు. మధ్యలో నిలిచిపోయిన నిర్మాణ పనులను పున్ణ ప్రారంభించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రహరీ కూడా నిర్మాణం చేపట్టకపోవడం వల్ల విద్యాలయాల్లో రాత్రి సమయాల్లో అసంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నూతనంగా ఏర్పడిన విద్యాసంస్థల అభివృద్ధి చైర్మన్లు, కమిటీ సభ్యులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేయాలని, విద్యార్థులు ,విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



అల్లిపూడి జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్మాణంలో ఉన్న స్కూల్ భవనం

ఆక్రమణల చెరలో ములికిపల్లి సెంటర్

- ఇబ్బందిపడుతున్న స్థానికులు, వాహనదారులు
- వెంటనే తొలగించాలని వేడుకోలు

ప్రజాశక్తి- రాజోలు

మండలంలోని ములికిపల్లి సెంటర్ లో ఆర్అండ్‌బి రహదారిపై అక్రమంగా ఏర్పాటు చేస్తున్నా. మూడు అంతస్థుల భవన నిర్మాణంపై యంత్రాంగం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు,ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణంలో గ్రౌండ్ లెవిల్ లో వ్యాపార దుఖాణాలు ఉండటంతో కనీసం పార్కింగ్ స్థలం లేకుండా, నిబంధనలకు వ్యతిరేఖంగా భవన నిర్మాణం జరుగుతోంది. ఇది పూర్తిగా ట్రాఫిక్ కు అడ్డుగా ఉంది. సెంటర్ లో రహదారిని ఆనుకుని నూతన కట్టడాలు కొనసాగిస్తున్నారు. దీనిపై ఆర్అండ్బి అధికారులు, పంచాచతీ సిబ్బంది పట్టించుకోవడంలేదు. దశాబ్దాలుగా ములికిపల్లి సెంటర్ నుండి కడలి రోడ్డు మార్జిన్లో కొందరు చిన్న చిన్న వ్యాపార షాపులు ఏర్పాటు చేసుకోవటంతో పాటు తమ సామగ్రిని రోడ్డుపై వేయడంతో ఈ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. దీంతో తరచూప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ములికిపల్లి సెంటర్ లో రోడ్డుకు ఆనుకుని నిర్మించిన కట్టడం

ప్రమాదకరంగా ప్రధాన రహదారులు

- వెదురుమూడి మలుపు వద్ద ప్రమాదకరంగా గోతులతో ఏర్పడిన రహదారి
- ఎర్ర పోతవరం వద్ద కాలువ వైపు కుంగిన ద్రాక్షారామ-యానాం మెయిన్ రోడ్డు



వెదురుమూడి మలుపు వద్ద ప్రమాదకరంగా గోతులు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల ప్రధాన రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి.దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారులు శిథిలావస్థకు చేరుకోవడం, పెద్ద గోతులు పడటంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. రహదారులపై ఉన్న గోతుల్లో ద్విచక్ర వాహనదారులు పడి గాయాల పాలవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురం మండల పరిధి వెదురుమూడి నుండి జొన్నాడ వెళ్లాలంటే ఆర్ అండ్ బి రహదారి గోతులతో ప్రమాద భరితంగా మారింది. ఈ రహదారి పై ప్రయాణాలు చేయాలంటే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి రోజు రద్దీగా ఉండే ఈ రహదారి మీదుగా పాఠశాలకు వెళ్లే వాహనాలు ద్విచక్ర వాహనదారులు వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు రహదారి లో మలుపు ఉండడం ఆ మలుపు సమీపంలో పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని ప్రజలు, స్థానికులు వాపోతున్నారు. ఈ రహదారి మీదుగా వెళ్లాలంటే విద్యార్థులు, వాహనదారులు గోతుల కారణంగా ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు మీదుగా కొత్తూరు, జొన్నాడ, రావులపాలెం, మండపేట తదితర గ్రామాల ప్రజలు ప్రతి నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటారు . ఎంతో రద్దీగా ఉంటున్న రహదారిపై ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులకు ఎటువంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు గోతులు ఏర్పడిన ప్రదేశాల్లో మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, వాహన దారులు ప్రయాణికులు, ప్రజలు స్థానికులు కోరుతున్నారు.

రామచంద్రపురం: ద్రాక్షారామం నుంచి యానాం వెళ్లే మెయిన్ రోడ్ ప్రమాద భరితంగా తయారైంది. గత పదిహేడుగా అభివద్ధి కోసం ఈ మెయిన్ రోడ్డు ఎర్ర పోతవరం నుంచి కోలంక వరకు మరింత దారుణంగా శిథిలమైంది. ఎర్ర పోతవరం నుంచి పంట కాలవై రోడ్డు కాలువ వైపు పగిలి పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మెయిన్ రోడ్డు కాలువైపు కంగి పోవడంతో పగులు ఏర్పడి రాత్రి సమయంలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్ అండ్ బి అధికారులు ఇక్కడ ఒక ఎర్రజెండా ఏర్పాటుచేసి చేతులు దులుపుకున్నారు. చీకట్లో ఈ రహదారిపై ఉన్న ఈ పగులు కుంగిపోయిన ప్రాంతంలో ప్రమాదాలు జరిగి పలువురు ప్రయాణికులు ఆసుపత్రుల పాలవుతున్నారు. సుమారు 18 కిలోమీటర్లు పొడవైన ఈ మెయిన్ రోడ్డు వెంబడి ద్రాక్షారామ, వేగాయమ్మపేట, రామచంద్రపురం, బాలాంతరం, కొయ్యేరు, కోలంక, కాపుల పాలెం, అమలాపురం వెళ్లే ప్రయాణికులకు ఇదే ప్రధానమైన మెయిన్ రోడ్డు కావడంతో నిత్యం ఈ మెయిన్ రోడ్డు రద్దీగా ఉంటుంది. దీనిపై ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు నిర్వహించి ప్రమాదాలు నివారించాలని పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎర్ర పోతవరం వద్ద కాలువ వైపు కుంగిన ద్రాక్షారామ-యానాం మెయిన్ రోడ్డు